క్లుప్తంగా

ఎస్ఎస్‌యూ పరీక్షా విధానానికి ప్రశంసలు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పరీక్షా విధానానికి ప్రశంసలు లభించాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్(ఏబీసీ) కార్యశాలలో మంగళవారం తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎస్ఎస్‌యూ) అధికారులు పాల్గొన్నారు. పరీక్ష విభాగం అధికారులు డాక్టర్ కంభంపాటి సాంబశివమూర్తి ఈ కార్యాశాలలో పాల్గొని వర్సిటీలో అమలు చేస్తున్న పరీక్షా విధానాలను, విద్యార్థులకు అందజేస్తున్న సేవలను వివరించారు. వర్సిటీ అవలంభిస్తున్న పరీక్షా విధానాన్ని పలువురు ప్రశంసించారు. ఈ కార్యశాలలో దేశంలోని 57 సెంట్రల్ యూనివర్శిటీల ఏబీసీ నోడల్ ఆఫీసర్లు, టెక్నికల్ పర్సన్స్ హాజరయ్యారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రతిభ



ప్రతిభ చాటిన ఎ.హరినాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: సీఏ ఇంటర్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో ఎ.హరినాథరెడ్డి 441 మార్కులు సాధించాడని, అలా గే జె.రేవతి, కె.యశ్వంత్, టి.రాజశేఖర్, జె.మునిమోహిత్, డి.అమత్యా, ఎస్‌వి.శ్రావ్య, డి.దామోదర్, పి.హువేజ్‌ఖాన్, కె.పుష్యేంద్ర రెడ్డి, సి.మాధురి మంచి ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో 51.47శాతం ఉత్తీర్ణతను తమ విద్యార్థులు సాధించినట్లు వారు తెలిపారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: ఉపాధ్యాయ నగర్ సర్వేనెంబర్ 11/2బీ2ఏలోనున్న తమ భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సత్యనారాయణపురానికి చెందిన బాధితురాలు జ్యోతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జ్యోతి, హేమ హెప్సీబా వారి కుటుంబసభ్యులతో కలిసి మాట్లాడారు. భూమికి సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకుండా భూమి తమదేనంటూ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ ప్రొఫెసర్ రాజశేఖర్

రామచంద్రాపురం: ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ జువాలజీ ప్రొఫెసర్ డా.రాజశేఖర్ అన్నారు. మంగళవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఎమర్జింగ్ ఇన్నోవేటివ్ ట్రెండ్స్, చాలెంజెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో అవకాశాలను వివరించారు. సెవెన్ హిల్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీటీడీ తాత్కాలిక ఈవోగా జేఈవో వీరబ్రహ్మం

తిరుమల: టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పదహారు రోజులపాటు సెలవుపై వెళ్లనున్నారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా వెళ్లనుండడంతో టీటీడీ తాత్కాలిక ఈవోగా జేఈవో వీరబ్రహ్మంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది.

ప్రజలను ఓట్లు అడిగే హక్కు మాకే ఉంది

- 40ఏళ్లల్లో జరగని అభివృద్ధి, సంక్షేమం జగనన్న పాలనలో సాధ్యం
- దేశానికే ఆదర్శంగా తిరుపతి నగర అభివృద్ధి
- ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పే వారిని నమ్మకండి
- రూ.3వేల పెన్షన్ పంపిణీలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: దేశ రాజకీయ చరిత్రలో ఎవ్వరూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి, పాలకులమైన తమకే ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఉందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. జగనన్న అందించిన రూ.3 వేల పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని తిరుపతి చెన్నారెడ్డి కాలనీ వద్ద భారీ ఎత్తున లబ్ధిదారులతో ఓ పండుగలా నిర్వహించారు. అర్హులైన పెన్షన్‌దారులకు రూ.3 వేలు పెన్షన్‌ను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్, 2024ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ అందించారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత 40ఏళ్లల్లో జరగనంతగా అభివృద్ధి, సంక్షేమం చేకూరిందంటే అది కేవలం జగనన్న పాలనలోనే సాధ్యమైందన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక రూ.3.35 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించారన్నారు. కేవలం తిరుపతిలోనే 26 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు అందించి వారి సొంతింటి కల నెరవేర్చామన్నారు. 25ఏళ్లుగా నెరవేరని టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాలను కూడా అందించిన ఘనత జగనన్నదేనన్నారు. అదే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పట్టుమని పదిమందికి కూడా ఇంటి పట్టాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబుకు అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని, వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ కులాల పేరు చెప్పుకుని ఓట్లు అడిగే వారిని నమ్మవద్దని అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ప్రజలకు కోరారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, తలారి రాజేంద్ర, దేవదానం, కార్పొరేటర్లు నరేంద్ర, పొన్నాల చంద్ర, శైలజ, సీకే రేవతి, కల్పనయాదవ్, ఆదిలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే ఇమామ్ సాహెబ్, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, పార్టీ నాయకులు ఇమ్రాన్, బొగ్గుల వెంకటేష్, శ్యామల, నరిసింహులు, ఉదయ్‌వంశీ, భరణీ, నాధముని, కంకనాల రమేష్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా తిరుపతి అభివృద్ధి

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్య రాకుండా 22 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించామని, 22ఎ రద్దు చేయించి 7వేల మందికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని డిప్యూటీ మేయర్, 2024ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. 75ఏళ్లగా సమస్య పరిష్కారానికి నోచుకోని శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించి వారికి ప్రొసీడింగ్స్ అందించి భూ హక్కు కల్పించామన్నారు. చెన్నారెడ్డికాలనీలో పాడుపడిపోయిన కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. తాము అభివృద్ధి చేశాకే ప్రజల ముంగిటకి వచ్చి ఓట్లు అడుతున్నామన్నారు. ప్రజలను ఓట్లు అడిగే హక్కు, ధైర్యం తమకే ఉందన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



రూ.3 వేలు పెన్షన్ తీసుకునేందుకు హాజరైన లబ్ధిదారులు

ఎమ్మెల్యేగా మోహిత్ రెడ్డిని గెలిపించండి



చంద్రగిరి గడప గడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- జగనన్న సంక్షేమం.. అభివృద్ధి పనులే అండ
- గడపగడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి, ఆశీర్వదించాలని ఆయన సోదరుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డితో కలసి చంద్రగిరి పట్టణంలోని జమండ్ల వీధి, ఆర్ఎఫ్ రోడ్డు, మాతా వీధి, విజయనగర్ కాలనీ, నూకలబండ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి గడపలో జగనన్న సంక్షేమ పథకాల జాబితాను అందిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు.. ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులే వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజయానికి అండగా నిలుస్తాయని వెల్లడించారు. గడప గడపలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించగా ఎమ్మెల్యేగా చెవిరెడ్డి చేసిన మేలును తాము మరువలేమని, తప్పకుండా వచ్చే ఎన్నికల్లో మోహిత్‌రెడ్డిని గెలిపించుకుంటామని పలువురు మహిళలు, వృద్ధులు మాట ఇచ్చారు. స్థానికంగా వచ్చిన సమస్యలపై తన వెంట వచ్చిన అధికారులతో చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూడాలని సూచించారు. ప్రతి వీధిలో అపూర్వ స్వాగతం చంద్రగిరి పంచాయతీలో పర్యటిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. వైఎస్ఆర్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మస్తాన్, కోలా మల్లి, తానాటి చంద్ర, ముదికుప్పం రామ్మూర్తి, మాజీ ఎంపీపీ కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, కొత్తపాటి కోటి, హరి, విరుపాక్షి ప్రసాద్‌రెడ్డి, రాజయ్య, మట్టిరెడ్డి నవీన్, జ్యోతి, నర్ల నజరత్, అంగేరి రాజశేఖర్, మొక్కల రాజా, మునీంద్ర, బండారు హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే టీడీపీ నేతల తప్పుడు ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ నేత పసుపులేటి సురేష్


తిరుపతి కల్చరల్: ప్రజా సంక్షేమంతోపాటు ఆధ్యాత్మిక తిరుపతి నగరాభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కుటుంబానికే దక్కుతుందని వైఎస్ఆర్ సీపీ నేతలు స్పష్టం చేశారు. భూమన కుటుంబంపై ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ నేతలు రోజుకొక తప్పుడు ప్రచారంతో దిగజారుడు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిశోర్, కాపు నాడు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సురేష్ మాట్లాడారు. టీడీపీ నేతలు నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారం కోసం భూమన కుటుంబంపై నిందలు వేస్తూ తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. 2004లో టీడీపీ మేనిఫెస్టోలో బలిజ, కాపు వర్గాలకు ఎనలేని హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా కాపు, బలిజ సామాజిక వర్గాన్ని నట్టేట ముంచారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బలిజ, కాపు, ఒంటరి, తెలగ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బలిజ, కాపు సామాజిక వర్గాలకు పదవులు కల్పించి, వారిని ఆదరించారన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి మార్గదర్శిగా నిలిచిన భూమన అభినయ్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలిచి, ఆయన్ను గెలిపిస్తారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం మానుకోవాలని లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రజా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్పొరేటర్ హరీష్ రాయల్, సూర్య రాయల్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లోకి వస్తేనే బస్సు

- బస్టాండ్‌లోనే దిగేస్తున్న కండక్టర్లు

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి 26 మెట్రోల్ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ సర్వీసులు అన్ని వన్‌మ్యాన్ సర్వీసులే(డ్రైవర్ మాత్రమే ఉంటాడు). శ్రీకాళహస్తి దేవస్థానం నేపథ్యంలో ఈ మార్గంలో నిత్యం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. తిరుపతి శ్రీహరి బస్టాండ్‌లోని 9, 10వ ప్లాట్ ఫాంలలో ఈ సర్వీసుల స్టాపింగ్ ఉంటుంది. అయితే కండక్టర్లు బస్టాండ్‌లో టిక్కెట్లు కొట్టిన వెంటనే దిగేస్తున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంగణంలోని పడమర వైపు, దక్షిణం వైపు, తూర్పు వైపున పలువురు ప్రయాణికులు బస్సు ఎక్కడానికి అవకాశం లేకుండా పోతుంది. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్టాండ్ ప్రాంగణం దాటేవరకైనా కండక్టర్లు ఉండి... ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తే బాగుంటుందని కోరుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డికి ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదంటూ వాపోతున్నారు. అధికారులు ప్రయాణికుల ఇక్కట్లు గుర్తించి.. రామానుజ సర్కిల్ వరకు కండక్టర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి సునీల్

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం, అనుప్పల్లి, కాలేపల్లి గ్రామాల్లో మామిడిలో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానవన అధికారి సునీల్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూత దశలో తేనె మంచు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, మాంకోజెబ్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తామర పురుగులు, మంగు నివారణకు ఫ్రూట్ కవర్స్‌ను వాడుకోవాలని సూచించారు. ఇతర సలహాలు, సూచనల కోసం రైతులు వారి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు.

సామాజిక న్యాయ మార్గంలో నడుస్తాం..



అంబేడ్కర్ చిత్రపటానికి పూజ చేస్తున్న ఎంపీపీ లోకనాథం

పాకాల: సామాజిక న్యాయ మార్గంలో నడుస్తామని, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పి.లోకనాథం అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగులు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని, అందరం ఆయన బాటలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏఓ కరుణాకర్, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, హరీష్, శంకర, పంచాయతీ కార్యదర్శులు బేబీరాణి, పుష్పలత, ఫణీంద్రకుమార్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



నిరాహార దీక్షలో పాల్గొన్న రైల్వే కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని రైల్వే ఉద్యోగులు మంగళవారం నిరాహార దీక్షను కొనసాగించారు. ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా పిలుపు మేరకు అన్ని కార్మిక సంఘాలు ఉద్యోగులు 11వ తేదీ వరకు దీక్షలను కొనసాగించనున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తిరుపతి జనరల్, టెక్నికల్ శాఖలు సంయుక్తంగా మంగళవారం తిరుపతి కోచింగ్ డిపో కార్యాలయం ఆవరణలో సాయంత్రం 6 గంటల వరకు నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కె సుదర్శన్‌రాజు, తిరుపతి జనరల్ బ్రాంచ్ చైర్మన్ నారాయణస్వామి, టెక్నికల్ బ్రాంచ్ చైర్మన్ మునిరత్నం, సెక్రటరీ ఎస్ రవీంద్ర నాయక్, కోశాధికారులు గౌస్‌బాషా, మారయ్య, దేవేంద్ర నాథ్, శివ కుమార్, జగదీశ్, వెంకటేష్, అమిత్ పాశ్వాన్, శ్రీనివాసులు, మనోహర్, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

తిరుపతి అలిపిరి: ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం జేఈవో తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర, డెప్యూటీ సీఎఫ్ శ్రీనివాస్, డెప్యూటీ ఈవో శివ ప్రసాద్, ఈఈ వేణుగోపాల్, డీఈ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ప్రెస్ ప్రత్యేకాధికారి రామరాజు పాల్గొన్నారు.

త్వరలోనే శ్రీవాణి నిధుల వినియోగంపై నివేదిక



టీటీడీ ఈవో ధర్మారెడ్డితో మాట్లాడుతున్న మీడియా నిజ నిర్ధారణ కమిటీ

తిరుపతి అలిపిరి: శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగం వ్యవహారంలో ఆరోపణలు తలెత్తడంపై పూర్తిస్థాయిలో నివేదికలు సమర్పించనున్నట్లు నిజ నిర్ధారణ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో మీడియా నిజ నిర్ధారణ కమిటీ టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఫైనాన్షియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజీ, జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావులతో విడివిడిగా కలిసింది. తాజాగా ట్రస్టు నుంచి వచ్చిన నిధుల వినియోగం.. ఆర్థిక అంశాలపై టీటీడీ చీఫ్ పీఆర్‌ఓ తలారి రవితో కలిసి మాట్లాడారు. ఈ క్రమంలో మీడియా నిజ నిర్ధారణ కమిటీ మరిన్ని వివరాలను సేకరించింది. త్వరలోనే సమగ్ర నివేదికను సమర్పించనున్నట్లు పేర్కొంది. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శ్రీధర్, ఎంపీఆర్ రాజు, ఆదిమూలం శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

చంద్రగిరి: గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లి సచివాలయ పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆముదాల కోన, కల్‌రోడ్డుపల్లి బీసీ కాలని, హరిజనవాడ ధనమూర్తివారిపల్లి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున క్యాంపు వద్దకు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటిచూపు మందగించిన వృద్ధులకు ఎంపీపీ కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఎంపీటీసీలు సులోచన, రాజయ్య, రెడ్డప్ప, పసల నాగరాజు, హరి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా విధులకు హాజరైన కార్మికులు



తిరుపతి తుడా: పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు కమిషనర్ హరిత హామీ మేరకు మంగళవారం నుండి తమ నిరసనను శాంతియుతంగా చేస్తూనే స్వచ్ఛందంగా విధులు నిర్వహిస్తున్నారని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. వారం రోజులుగా కార్మికుల సమ్మె ప్రభావంతో తిరుపతి నగరం అంతా చెత్త కుప్పలతో నిండిపోయింది. దీనికి తోడు వర్షంతో చెత్త కుప్పలు కుళ్లి దుర్వాసన వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కమిషనర్ హరిత యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. కమిషనర్ ఇచ్చిన హామీలతో మంగళవారం ఉదయం నుండి పారిశుధ్య కార్మికులు స్వచ్ఛందంగా విధులకు హాజరయ్యారు.

ఘనంగా ముగిసిన వికసిత భారత్

తిరుపతి గాంధీరోడ్డు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు మరింత చేయాలని ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నవంబర్ 15న వికసిత భారత్ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమం జనవరి 26తో ముగియనుంది. అందులో భాగంగా తిరుపతి నగరంలో డిసెంబర్ 13న ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్ర మంత్రులతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సైతం పాల్గొన్నారు. మంగళవారం ఈ కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. నోడల్ ఆఫీసర్ రవి వికసిత భారత్ సంకల్ప యాత్ర వాహన సిబ్బంది రెడ్డప్ప, రంజిత్ కుమార్, రాజేంద్ర, పోస్టల్ సిబ్బంది రంజిత్, సుధాకర్ మోహన్‌లను ఘనంగా సన్మానించారు. గుండాల గోపీనాథ్, మునిసి సుబ్రహ్మణ్యం, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రభాకర్ నాయుడు, వరప్రసాద్ పాల్గొన్నారు.